## అభిమానుల దురభిమానం - by SKU

Back Home

సినీ నటుడు బాలకృష్ణ ఇంటిలో కాల్పులు విషయం పైకి అదేదో ఇద్దరు, ముగ్గురు వ్యక్తుల మధ్య గొడవగా కనిపించినా నిజానికి దీనికి కారణం, ఒక వేళ రికార్డుల వివాదమే అయితే, ఆ హీరో అభిమానులు (or దురభిమానులు) కూడా. "నరసింహానాయుడు" చిత్రం రికార్డు కలెక్షన్లతో నడవటం కాదు కానీ ఈ రికార్డులూ, ప్రింట్లూ, సెంటర్ల గొడవ మొదలు అయింది.

"నరసింహానాయుడు" చిత్రం విజయం తరువాత దానిని మించిన విజయం సాధిస్తుంది అనే ఆశతో చిరంజీవి "ఇంద్ర" చిత్రం కోసం ఆయన అభిమానులు ఎదురు చూసారు. ఆ చిత్రం వారి ఆశలని తీర్చింది.. "నరసింహానాయుడు" రికార్డులు అధిగమించింది. వున్న ఇద్దరు హీరోలకి తోడు యువ హీరో Jr.NTR తన "సింహాద్రి" చిత్రం సూపర్ హిట్ తో ఈ పోటీల రంగం మీదకి ఈ లోగా దూసుకువచ్చారు. ఆ చిత్రం ఈ ఇద్దరి హీరోల అభిమానులకి మింగుడుపడని విధంగా "ఇంద్ర" రికార్డులని అధిగమించి ఆడింది. ఇప్పుడు ఆ "సింహాద్రి" రికార్డులని అధిగమించటానికి ఇద్దరు హీరోలూ చమటోడ్చటం, వారి అభిమానులు ఎదురు చూడటం మొదలెట్టారు.

తదుపరి విడుదల అయిన బాలకృష్ణ నటించిన చిత్రం విడుదల అయిన వెంటనే ఫ్లాప్ టాక్ రావటంతో ఆ చిత్రం రంగం నుండి నిష్క్రమించింది. ఇంక మిగిలింది చిరంజీవి "ఠాగూర్" చిత్రం. దానిని రికార్డు సెంటర్లలో శతదినోత్సవ దినం వరకూ ఎలాగైతేనేం లాక్కొచ్చారు! ఇప్పుడు ప్రస్తుత విజేత "ఠాగూర్". రాబోయే చిత్రం ఏదైనా, "ఠాగూర్" రికార్డుని అధిగమించాలి. తరువాత వచ్చిన Jr.NTR చిత్రం మొదటి కొద్ది రోజుల్లోనే వెనుతిరిగింది. రంగంలో మిగిలిన "లక్ష్మీ నరసింహా" చిత్రం బానేవుంది అనే టాక్ రావటంతో రికార్డు సెంటర్లలో అర్ధ శతదినోత్సవం జరిపించారు. కానీ అర్ధశతదినోత్సవం తరువాత కొత్త చిత్రాల వలనో, చిత్రంలో పస లేకపోవటం వలనో కలెక్షన్లు తగ్గుముఖం పట్టాయి.. దానితో దానిని లాగాల్సిన పరిస్థితి మొదలయింది. వుట్టప్పుడు మరి ఇక్కడనుండీ అభిమానులు చూసుకుంటారు. ఈ చిత్రం విషయంలో మరి అభిమానులు అది చేయటం మానేసి.. ఆ పని నిర్మాత మీద వేసారు. ఆయన ఆ పని చేయలేదు. అది హీరో ప్రెస్టేజీ ఇష్యూలా బాలకృష్ణ అభిమానులు చిత్రం ఆడించటంలో విఫలం అయిన నిర్మాతని నిలదీసారు. ఆయన చేతులు ఎత్తేసి, నాదేం లేదు, మీ హీరోని అడగండి అన్నారుట.. దానితో.. హీరోకి చిన్నతనం అయిందిట, అభిమానులూ అవాక్కయ్యారుట. అప్పడి నుండీ లోపల్లోపల రగులుతున్న లుకలుకలు ఈ విధంగా క్లైమాక్స్ కి చేరుకున్నాయిట.

ఈ మొత్తం నేను సృష్టించినది కాదు.. గత కొద్ది రోజులుగా వార్తలలో వస్తున్న వార్తల సారాంశం. అవి పరిశీలిస్తే, ఈ మొత్తం ఘాతకంలో నిందితులు కేవలం ఆ ట్రిగ్గర్ లాగిన వ్యక్తి లేక వ్యక్తులేనా? లేక అలా చేసే పరిస్థితులు కల్పించిన ఈ సినిమా పరిశ్రమలోని పోటీ తత్వం లేక దురభిమానుల అర్ధం లేని పట్టుదల లేక వారి వ్యక్తిగత గొడవలు??

ఎవరైనా పోటీ పడితే పనిలో శ్రద్ధ చూపి మరింత మంచి సినిమాలు తీయాలి, మరింత మంది అభిమానం పొంది తమని తాము నిరూపించుకోవాలి అని అనుకుంటారు. మరి మన సినీ పరిశ్రమలోని అగ్ర హీరోలు ఏం చేస్తున్నారు? వాళ్ళు తీసే చిత్రాలలో ఒరిజినాలిటీ ఎంత? తీసేవి నాశిరకం సినిమాలు అయినప్పుడు అవి అభిమానుల లేక ప్రేక్షకుల అభిమానాన్ని ఎలా చూరగొంటాయి? మొదట్లో ప్రింట్ల అంకెలతో కొట్టుకునేవారు.. ఇప్పుడు శతదినోత్సవ సెంటర్ల అంకెలతో కాల్చుకుంటున్నారు! పైగా ఈ దురభిమానులు బాలకృష్ణని అరెస్ట్ చేస్తే ఆత్మాహుతి చేసుకుంటామని

బెదిరింపులుట. ఎవరు ఈ అభిమానులు.. ఇలా చేసే వారు అభిమానులా?

అభిమానం ఏమో కానీ ఈ హీరోలలోని క్రియేటివిటీ ని మాత్రం చంపేస్తున్నది వీళ్ళే. వేరే హీరో కాలు బాగా వంకర్లు తిప్పి ఎదో వెరైటీ స్టెప్పు వేసాడని.. ఈ హీరో వీణ స్టెప్పు వేయటం.. ఈయన వీణ వాయించాడని ఆయన కుర్చీ తిప్పటం.. ఆయన కుర్చీ తిప్పాడని ఇంకోకాయన వయొలిన్ వాయించటం.. అవి చూసి వెర్రి అభిమానులు వీణ వాయించటం బాగుంది అంటే, వయొలిన్ వాయించటమే బాగుంది అని తన్నుకోవటం.. ఏమిటో!?

ఈ వెర్రి ఒక్క డాన్సులకి పరిమితం కాలేదు. ఒకాయన ఫాక్షన్ చిత్రం తో సూపర్ హిట్ సంపాదిస్తే, ఫాక్షన్ ఫార్ములా తో తీసిన చిత్రాలు హిట్ అవుతాయన్న భ్రమ తో రెండో హీరో గారు కూడా మరింత గోరీ కథ తో ఫాక్షన్ చిత్రం తీయటం. ఒకాయన రీమేక్ చిత్రం తో హిట్ కొడితే.. రెండో ఆయన డబ్బింగ్ మార్కెట్ లో వున్న చిత్రాల వెంట పరుగులు పెట్టడం.. ఇంతే తప్ప.. మంచి చిత్రం అందించాలన్న తపన ఎక్కడైనా వుందా ఈ నిర్మాతల్లో కానీ ఆ నటించే నటుల్లో కానీ?

కొన్నేళ్ళ క్రితం ఈ అభిమానులు మరీ ఇంతలా వారి హీరోల చిత్రాలని శాసించేవారు కాదు. దానివలన లాభాలు రావని తెలిసినా ఈ హీరోలు కనీసం అప్పుడప్పుడు మంచి చిత్రాలు అందించగలిగారు. ఈ అభిమానులు ఆత్మవిమర్శ చేసుకొని, తాము ఆయా హీరోల అభిమానులు ఏ చిత్రాల వలన అయ్యారో తరచి చూసుకోవలసిన సమయం వచ్చింది. ఒక విశ్వనాధ్ కానీ ఒక బాపూ కానీ ఇప్పుడు ఈ హీరోలతో చిత్రం తీయటానికి సిద్ధం అయినా ఈ హీరోలు తమ ఇమేజ్ చట్రం నుండి బయటకి వచ్చి, ఆ దర్శకుల పంథాలో నటించగలరా? ఏదో ఒక ప్రతిభ వుండటం చేతనే వారు అగ్ర హీరోలు అయ్యారు, అంత మంది అభిమానులని సంపాదించుకోగలిగారు. ఆ నట ప్రతిభ కి, మంచి దర్శక ప్రతిభ కూడ జోడీ అయితే మంచి చిత్రాలు రావంటారా? అది చేయటం మానేసి, హత్యలూ, పిచ్చి గంతులకీ, నేటివిటీ లేని పరబాషా కథలకీ ప్రాధాన్యం ఇచ్చి వాటి తోదిదే సినిమా అనుకోవటం ఎంత వరకూ సబబు? అలా చేసేలా ఆ హీరోలని చేస్తున్న ఈ అభిమానుల ది కాదా ఆ తప్పు?

బాలకృష్ణ వుదంతం తీసుకుంటే, ఆయన కీ బెల్లంకొండ సురేష్ కీ "లక్ష్మీ నరసింహా" చిత్రం గురించి పందేలు కాసి లక్షలు పోగొట్టుకొని ఆత్మ హత్యలు చేసుకున్న కొంత మంది అభిమానులకి పరిహారం గురించి తేడాలు వచ్చాయని వార్తలు చదివాను. ఎవరు కాయమన్నారు ఆ అభిమానులని ఈ పందేలు? బాలకృష్ణ కాయమన్నారా? సినిమాని సినిమాగా చూడక ఈ పందేలు ఏమిటి.. ఆత్మ హత్యలు ఏమిటి? తమ హీరో ని యువ హీరో త్వరలో అధిగమిస్తారని ఎదో పేపర్ రాసింది అని మరో హీరో దురభిమానులు వెళ్ళి ఆ వార్త రాసిన పేపరాయన్ని చితక బాదారుట. హీరో గారు బానే వుంటారు, అంగ బలం, అర్థం బలం వున్న పత్రికాధిపతీ ఎలాగోలా బానే వుంటారు.. ఒళ్ళూ పై తెలీకుండా వెళ్ళి చేయి చేసుకున్న ఆ అభిమానుల గతి ఏమిటి? వాళ్ళ ఇళ్ళ వాళ్ళు వాళ్ళని కని పెంచింది ఇలాంటి ఘన కార్యాలు చేయటం కోసమా?

ఈ అనారోగ్యకరమైన పోటీ మొదలయిన దరిమిలా విడుదల అయిన చిత్రాలని చూస్తే అర్థం అయేది ఏమిటి? ఈ పోటీ కోసం హీరోలు విలన్లని మరింత ధారుణంగా చంపటం, డాన్సులూ, ఒకాయన కార్ల చేస్ పెడితే ఒకాయన విమానాల చేజ్, దానికి పోటీ రైళ్ళ చేజ్ ఇవీ వాళ్ళు తీసే కళాఖండాలు!! ఇంతోటి అద్భుతమైన చిత్రాలూ జనాలు చూడక పోతే ఏముందీ అభిమానులు ఆడించటం.. అదీ

సాగకపోతే, ఆడించమని నిర్మాతలని పీక్కు తినటం!

అసలు ఈ నటులు ఇలా ఇమేజ్ చట్రంలో కావాలని బందీలుగా మిగిలిపోతున్నారో.. లేక అభిమానులు తమ దురభిమానంతో తమ హీరోల జీవితాలనీ, కెరీర్ లనీ శాసిస్తున్నారో ఆలోచించాల్సిన సమయం వచ్చింది. కాదంటారా?

---

మీ సూచనలూ సలహాలూ రచయిత్రి SKU కి తెలియచేయండి.